సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



దిగుబడి..దిగాలు

ఈ ఏడాది పత్తి సాగు రైతులకు కలిసిరా లేదు. అధిక వర్షాలకు పంటంతా దెబ్బతిని దిగుబడి పడిపోయింది. వివరాలు IIలో ▸



కారు చీకట్లో 'కాంతి' రేఖ

కంటి సమస్యతో బాధపడుతున్న వారికి శుభవార్త. తిరిగి చూపును ప్రసాదించడానికి కేంద్రం చర్యలు చేపట్టింది. వివరాలు IIలో ▸



నాలాల ఆక్రమణలు

జహీరాబాద్ పట్టణంలో ప్రధాన నాలాలు ఆక్రమ ణలకు గురవుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

వివరాలు IIIలో ▸

మందకొడిగా దరఖాస్తులు

- ఒక్క దరఖాస్తు కూడా రాని మద్యం షాపులు నాలుగు
- ఆశించిన స్థాయిలో మద్యం వ్యాపారుల నుంచి స్పందన కరవు
- చివరి రెండు రోజుల్లో బల్క్‌గా వస్తాయనే ధీమాలో ఎక్సైజ్ వర్గాలు
- రేపటితో ముగియనున్న గడువు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మద్యం షాపులను దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులు పోటీ పడుతుండటం సాధారణం. సిండికేట్‌గా మారి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటుంటారు. కానీ జిల్లాలోని నాలుగు మద్యం షాపులకు మాత్రం గురువారం వరకు ఒక్కటంటే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు షాపులకు, అందోల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మరో షాపునకు ఇప్పటివరకు ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. ఈ నాలుగు మద్యం షాపులు రిజర్వేషన్ కేటగిరీలో ఉన్నాయి. కాగా మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు శనివారంతో ముగియనుంది.

ఈసారి స్పందన అంతంతేనా?

మద్యం షాపుల కేటాయింపుల విషయంలో ఈసారి మద్యం వ్యాపారుల నుంచి ఆశించిన మేరకు స్పందన కనిపించడం లేదు. 2023తో పోలిస్తే ఈసారి అంతంత మాత్రంగానే దరఖాస్తులు వస్తున్నాయి. ఈ జిల్లాలో ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 101 మద్యం షాపులున్నాయి. 2023లో నిర్వహించిన దరఖాస్తుల ప్రక్రియలో ఏకంగా 6,156 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి ఇప్పటివరకు 1,264 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులకు గడువు రెండు రోజులు మాత్రమే మిగిలిఉంది. చివరి రెండు రోజులైన శుక్ర, శనివారాల్లో పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు ధీమాతో ఉన్నారు. అయితే 2023లో వచ్చిన స్థాయిలో ఈసారి అంతగా రాకపోవచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అనుభవం ఉన్న వారితో కలిసి..

మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న వారితో కలిసి సిండికేటుగా మారి పెద్ద మొత్తంలో దరఖాస్తులు చేసుకునేందుకు మద్యం వ్యాపారులు సిద్ధమవుతున్నారు. కొత్తగా మద్యం వ్యాపారంలోకి అడుగు పెట్టాలనుకునే వారు కూడా కొందరు ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఒకవేళ అదృష్టం వరించి వచ్చిన మద్యం షాపును నిర్వహించలేని పక్షంలో ఎవరికైనా లీజుకు ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నారు. కాగా తక్కువ సేల్స్ ఉండే మద్యం షాపులు, మారుమూల ప్రాంతాల్లో ఉన్న షాపులను కొనుక్కునేందుకు మద్యం సిండికేట్ వ్యాపారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇతర జిల్లాలకు చెందిన మద్యం వ్యాపారులు కూడా ఈసారి జిల్లాలోని మద్యం షాపులను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మద్యం వ్యాపారులు దరఖాస్తులు చేసుకోవాలని భావిస్తున్నారు.

సిండికేటుగా మారి.. బల్క్‌గా దరఖాస్తులు

మద్యం వ్యాపారులంతా సిండికేటుగా మారి బల్క్‌గా దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఈ దరఖాస్తు ఫీజును రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే. అయితే పెరిగిన ఈ ఫీజును ఈ వ్యాపారులు ఏమాత్రం లెక్క చేయరనే అభిప్రాయం కూడా ఉంది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. బిల్లులు సకాలంలో రావనే భయంతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వీరంతా ఇప్పుడు ఈ మద్యం వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపుతారనే అంచనాలున్నాయి. పైగా ఈ వ్యాపారంలో మంచి లాభాలు ఉండటంతో ఎలాగైనా మద్యం షాపులను దక్కించుకునేందుకు పోటీ పడుతుంటారు.



వాలీబాల్ ఆడి క్రీడను ప్రారంభించిన కలెక్టర్

విద్యతోపాటు క్రీడలు ముఖ్యమే

- 69వ ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో కలెక్టర్ ప్రావీణ్య
- కామన్వెల్త్, ఒలింపిక్ క్రీడల్లో పతకాల సాధనకు కృషి చేయాలి: ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. పటాన్ చెరు మైత్రి క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 69 వఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను గురువారం కలెక్టర్ ప్రావీణ్య క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ...క్రీడాకారులకు ఈ మూడు రోజులు అత్యంత కీలకమని ఈ క్రీడల్లో రాణిస్తే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. చదువుతోపాటు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఈ క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ... కామన్వెల్త్, ఒలింపిక్ క్రీడల్లో పతకాల సంఖ్య పెంచేందుకు క్రీడాకారులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక దృఢత్వంతోపాటు విద్య,ఉపాధి అవకాశాల్లో అవకాశాలు వస్తాయని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు ఎస్పీ పరితోశ్ పంకజ్ శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారలోప నివారణకు పోషణ అభియాన్

పటాన్‌చెరు టౌన్: పౌష్టికాహార సమస్యల పరిష్కారానికి పోషణ అభియాన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పటాన్‌చెరులో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, సీడీపీఓ జయరాం నాయక్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో బాణసంచా దుకాణదారులు కచ్చితంగా పోలీసు శాఖ అనుమతి పొందాలని డీఎస్పీ సత్తయ్య స్పష్టం చేశారు. దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారస్తులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత ప్రదేశానికి కూడా ఎన్‌ఓసీ పత్రం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. దుకాణదారులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

పాఠశాలలో వైద్య శిబిరం



నోటు పుస్తకాలు అందించిన డాక్టర్ సునీత, హెచ్‌ఎం శ్రీనివాస్

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. హైదరాబాద్‌లోని ఈఎన్‌టీ హాస్పిటల్, రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్లు సునీత, సాహిత పిల్లలకు చెవి, ముక్కు, గొంతు సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి




అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని అతిక్రమిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు పరిధిలో పలుచోట్ల పొగాకు నియంత్రణపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పొగాకు వినియోగానికి అందరూ దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి



టీకా వేస్తున్న వసంతకుమారి

పటాన్‌చెరుటౌన్: పశు పోషకులు పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో పశు వైద్య సిబ్బందితో కలిసి గురువారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వసంత కుమారి మాట్లాడుతూ...పశు వైద్య శాఖ అందిస్తున్న టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిట్కుల్‌లో 163 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలివ్వాలి: సీఐటీయూ

సంగారెడ్డి: జిల్లాలో ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డీఎంఎచ్‌ఓ కార్యాలయంలో ఏఓ శ్రీవాణికి గురువారం ఆ సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ..ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పని చేస్తున్న అర్బన్ హెల్త్, ఏఎన్‌ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులందరికీ రెండు నెలల వేతనం పీఆర్సీ, ఏరియర్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అందరివాడే.. అయినా బదిలీ

రామచంద్రాపురం తహసీల్దార్ బదిలీపై జోరుగా చర్చ



సంగ్రామ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి ఆకస్మిక బదిలీ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రామచంద్రాపురం మండల పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూరు, ఈదులనాగులపల్లి, వెలిమెలలో రియల్ వ్యాపారం జోరుగా ఉండటంతో ప్రభుత్వ పెద్దల కన్ను ఈప్రాంతంపైనే ఉంటాయి. ప్రభుత్వం మారినా ప్రభుత్వానికి చెందిన ముఖ్యశాఖల అధికారుల బదిలీలు రాష్ట్ర స్థాయి బడా నేతల కనుసైగల్లో జరగడం సాంప్రదాయంగా వస్తోంది. ఈ ప్రాంతంలో ఏ శాఖలోనైనా పోస్టింగ్ రావాలంటే రాజకీయ పలుకుబడిఉన్న అధికారులు మాత్రమే ఇక్కడకి వస్తారన్న ఆరోపణలున్నాయి. వచ్చిన తర్వాత వారి ఆగడాలకు అంతూపొంతు లేకుండా పోతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వచ్చినప్పుడే వెళ్లిపోతారని...

రంగారెడ్డి జిల్లా నుంచి ఎన్నికల సమయంలో సంగ్రామ్‌రెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఎన్నికల తర్వాత సంగ్రామ్ రెడ్డి బదిలీపై వెళ్తారని స్థానికులు, రెవెన్యూ సిబ్బంది అనుకున్నారు. కానీ, ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలకు, బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సానుకూలంగా వ్యవహరించారన్న సానుభూతితో బదిలీ కాకుండా అడ్డుకున్నారని స్థానిక ప్రజలు చెప్పుకుంటున్నారు. దీంతోపాటు రియల్ ఎస్టేట్ సంస్థలకు వారనుకున్న విధంగా పనులు చేశారని రెవెన్యూ సిబ్బందే గుసగుసలాడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం సంగారెడ్డి ఆర్డీఓ బదిలీ అనంతరం సంగ్రామ్‌రెడ్డి సైతం బదిలీ కావచ్చని చాలా మంది చర్చించుకున్నారు.

మంత్రికి ఫిర్యాదు చేసినా..

అదే విధంగా గత కొన్ని నెలల క్రితం తెల్లాపూర్ పరిధిలోని ఓ వెంచర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని ఈ విషయాన్ని స్థానికులు ప్రధాన శాఖకు చెందిన మంత్రి దృష్టికి సమస్యను తీసుకుని పోయి విచారణ చేయాలని సదరు మంత్రికి లేఖ సైతం ఇచ్చారు. ఆ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించినా కొంతమంది అధికారులు, నేతల ఒత్తిడితో వాటిని పట్టించుకోలేదానే విమర్శలున్నాయి. వాటితో పాటు వివాదాస్పదమైన భూములలో తల దూరుస్తున్నారని సంగ్రామ్‌రెడ్డిపై గతంలో అనేక మార్లు స్థానికులు సైతం ఆరోపించారు. పెద్దల అండతో మరికొంతకాలం ఉంటారనుకున్న సదరు తహసీల్దార్‌పై జిల్లా ఉన్నతాధికారులు బదిలీ వేటు వేసి అందరిని విస్మయానికి గురిచేశారు. ఇదిలా ఉండగా బదిలీకి గల కారణాలు తెలియక కార్యాలయ సిబ్బంది, పలువురు తలలు పట్టుకుంటున్నారు. మృదుస్వభావంతో కనిపించే సంగ్రామ్‌రెడ్డి బదిలీ స్థానికం పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పటికైనా నిఘా అధికారులు ప్రభుత్వ కార్యాలయాలపై దృష్టి పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్

భోజనం నాణ్యతలో రాజీపడొద్దు

ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి

నారాయణఖేడ్: వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో రాజీపడవద్దని ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. ఖేడ్ పట్టణంలోని బీసీ సంక్షేమశాఖకు సంబంధించిన సమీకృత బాలుర వసతి గృహంతోపాటు ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించిన కళాశాల బాలుర వసతిగృహాన్ని ఉమాహారతి ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం సమీకృత వసతిగృహం విద్యార్థులతో కలిసి సబ్ కలెక్టర్ భోజనం చేశారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలపవచ్చు

కంగ్టి(నారాయణఖేడ్): ఆగిన గుండెకు వెంటనే కార్డియో పల్మోనరీ రెససిటేషన్(సీపీఆర్) చేయడం ద్వారా తిరిగి ప్రారంభింపచేసి ప్రాణాన్ని నిలపవచ్చని జిల్లా సీపీఆర్ ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ పేర్కొన్నారు. మండల కేంద్రం కంగ్టిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సీపీఆర్‌పై 108 సిబ్బంది శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా షాహిద్ మాట్లాడుతూ...గుండెపోటు వచ్చి శ్వాస ఆగిన వెంటనే రోగికి ఛాతీపై బలంగా అదమడం, తీయడం చేయాలన్నారు.

ఎన్నికల కమిటీలో డీసీసీలకు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న సిజరిట

ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు సిజరిట

జోగిపేట(అందోల్): కొత్తగా ఎన్నికయ్యే డీసీసీ అధ్యక్షులకు ఎన్నికల కమిటీలో కూడా అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుందని ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు సిజరిట పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో డీసీసీ అధ్యక్షులు కేవలం సమావేశాలు నిర్వహించడం, కార్యకర్తలను సమీకరించడం జిల్లాకు మాత్రమే పరిమితమయ్యే వారని, కానీ ఈసారి వారి ప్రాధాన్యతను పెంచేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎమ్మెల్యేల స్థానంలో టికెట్ కేటాయించే విషయంలో కూడా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. కార్యకర్తల్లో నుంచే డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సూచించారు. జహీరాబాద్ నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50కిపైగా డీసీసీ అధ్యక్షుడి పదవి కోసం దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఈనెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించి సంగారెడ్డిలోనే ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఐసీసీకి కేవలం ఆరుగురి పేర్లను మాత్రమే పంపుతామని, ఏఐసీసీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీలు ఎంపిక చేస్తారన్నారు. పార్టీలో మహిళల భాగస్వామ్యం కూడా అవసరమని వారిని కూడా రాజకీయంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పీసీసీ పరిశీలకులు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, రాష్ట్ర ఫెడ్కాన్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

బంద్ విజయవంతం చేయాలి

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బీసీ జేఏసీ నేతలు

సంగారెడ్డి : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ పిలుపునిచ్చింది. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం గురువారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ నేతలు పాల్గొని మాట్లాడారు. పార్టీలకతీతంగా జిల్లాలోని అన్ని బీసీ సంఘాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అంతకుముందు బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసి చైర్మన్ ప్రభుగౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్లు రాకుండా అడ్డుకుంటున్న వారికి తగిన గుణపాఠం చెబుదామన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, గోకుల్ కృష్ణ, వైస్ చైర్మన్ గోరుగంటి రమేశ్ కుమార్, వర్కింగ్ చైర్మన్ కుమ్మరి సాయిలు, నాయకులు హరికిషన్, కో-కన్వీనర్ పి.కృష్ణమూర్తి, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బీసీ రిజర్వేషన్ 42% అమలు కోసం ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌కు పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ...బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవో నం.9 ను హైకోర్టు కొట్టివేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని బీసీ జేఏసీ రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌ను చేర్చడం ద్వారా బీసీలకు 42% రిజర్వేషన్లను సాకారం చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, జిల్లా నాయకులు శ్రీకాంత్,పవన్, అభిషేక్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉపాధి హామీ సభలు

- వచ్చే ఆర్థిక ఏడాదికి రూపకల్పన
- గ్రామ పంచాయతీ తీర్మానాలతో ప్రణాళిక
- కూలీల జీవనోపాధిపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభలు ఆలస్యం



పనులు గుర్తించేందుకు నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభ

సంగారెడ్డి జోన్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించే గ్రామ సభలు జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ప్రతీ ఏటా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2 నుంచి సభలు నిర్వహించి పనులు గుర్తించేవారు. అయితే ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభలు నిర్వహించలేక పోయారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఆలస్యంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి.

బడ్జెట్ తయారీకి ఆదేశాలు

వచ్చే 2026–27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించడంతో పాటు కూలీల బడ్జెట్ తయారీకి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రజల సమక్షంలో ప్రజలతోపాటు రైతులకు ప్రయోజనాలు కల్పించే పనులను ఎంపిక చేయనున్నారు. సహజ వనరులతోపాటు వ్యవసాయ సంబంధిత, వ్యక్తిగత, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత గుర్తించాలని ఆదేశించారు. గత సంవత్సరంలో గుర్తించిన పనులతోపాటు చేపట్టిన పనుల వివరాలను సభలో చదువుతారు. ఉపాధి హామీలో జియోగ్రఫీకల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) యుక్త ధార యాప్‌ను ఉపయోగించి పనులను ఎంపిక చేస్తారు. గతంలో చేపట్టిన పనులు పూర్తయిన తర్వాతే కొత్త పనులు చేపడతారు. పంచాయతీల వారీగా గుర్తించిన పనులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

ఉపాధి హామీలో చేపట్టే పనులు

ప్రజలతోపాటు రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారు. పశువుల పెంపకానికి షెడ్ల నిర్మాణం, బయోగ్యాస్ ప్లాంట్, వ్యవసాయ పొలాలకు మట్టి రహదారులు నిర్మించడం, పండ్ల తోటల పెంపకం, నర్సరీల ఏర్పాటు, ఫామ్ పాండ్, ప్రభుత్వ భవనాలలో రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, నీటి నిల్వ గుంతలు, కందకాలు, బండరాళ్లతో చెక్ డ్యామ్, ఇంకుడు గుంతల నిర్మాణంతో పాటు వివిధ రకాల పనులు చేపట్టారు.

30.96లక్షల పనుల కల్పన లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30.96 లక్షల పనులు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు 18 లక్షలకు పైగా పని దినాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువగా పనులు కొనసాగుతాయి. జిల్లాలో 2.18 లక్షల జాబ్ కార్డులు ఉండగా 1.20లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి.

ఎంచె దాటేదెలా.. పంట చేరేదెలా!

వరద మిగిల్చిన నష్టం అన్నదాతలను వీడటం లేదు. మంజీరా వరదలతో కుర్తివాడ ఎంచె (వంతెన)కొట్టుకు పోయింది. ఇంత వరకు తాత్కాలిక మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో వంతెన అవతల మంజీరా ఒడ్డున సాగుచేసిన 200 ఎకరాల పంట నీటిపాలైంది. అలాగే సుమారు 800 ఎకరాల్లో పండిన వరి పంట కోత కొచ్చింది. కోసిన ధాన్యం ఇంటికి రావాలంటే ఎంచె ఒక్కటే మార్గం. 2008లో అప్పటి ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి చొరవతో రూ.78 లక్షల వ్యయంతో ఈ వంతెన నిర్మించారు. ఇటీవల వరదలతో రోడ్డు కొట్టుకు పోయిందని. ఇప్పుడు ధాన్యం ఇంటికి తీసుకు రావాలంటే మార్గం మూసుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వర్షాలు పడితే చేతికొచ్చిన పంట కూడా నీటి పాలవుతుందని. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– పాపన్నపేట(మెదక్)



కుర్తివాడ శివారులో కొట్టుకు పోయిన వంతెన

కోత కష్టాలు

పంట చేతికందే సమయంలో అకాల వర్షాలకు వరి నేలవాలింది. దీంతో రైతులు కోతలకు తంటాలు పడుతున్నారు. అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ, మల్‌చెర్వుతండా, రామవరం, పోతారం(జే), ధర్మారం గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. పొలంలోనే మొలక వస్తోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గి మద్దతు ధర లభించదేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)



రేగొండలో నేలకొరిగిన వరి పంట

క్లుప్తంగా

సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ కేసులు: డీఎస్పీ

154 సైలెన్సర్స్ ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. గురువారం పటాన్‌చెరు, ఇస్నాపూర్, అమీన్‌పూర్‌లో పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైలెన్సర్లను మార్పు చేసి పెద్ద శబ్ధాలతో నడుపుతూ వృద్ధులకు గర్భిణిలకు ఇబ్బంది కల్పిస్తూ శబ్ధ కాలుష్యానికి పాల్పడుతున్న 154 మంది వాహనదారులను పట్టుకున్నారు. వారికి జరిమానా విధించారు. సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.

ముగ్గురికి జైలు శిక్ష

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్ష పడినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 27 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరు పర్చగా, విచారణ అనంతరం 27 మందికి రూ.37,500 జరిమానాతో పాటు వీరిలో ముగ్గురు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటో బోల్తా.. ఇద్దరి గాయాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తా వద్ద ఆటోబోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామం నుంచి గురువారం జహీరాబాద్‌కు వస్తున్న ఆటోను వెనుకాల నుంచి మరో వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న శ్రీనివాస్, రవిలకు గాయాలైయ్యాయి. వారిని వెంటనే జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన టేక్మాల్ మండలం పల్వంచలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాయి కోటి కృష్ణ(32) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచుగా చేపలు పడుతుంటాడు. గురువారం ఉదయం చెరువు వైపుకు వెళ్లిన కృష్ణ ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లతో వెతికించగా మృతదేహాన్ని బయటకు తీశారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మాసాయిపేటలోని శ్రీనివాస్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, కామారెడ్డి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వ హించారు. మృతుడు బూడి ద రంగు జీన్స్, లేత ఆకుపచ్చరంగు టీషర్టు వేసుకున్నట్లు తెలిపారు. మృతుడి బంధువులు కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

వట్‌పల్లి(అందోల్): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. రాయికోడ్ మండలం ఎనికపల్లి గ్రామానికి చెందిన పడకంటి పుష్పలత(32)తన కూతురు శ్రీవల్లి అందోల్ గురుకుల పాఠశాలలో 6 వ తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన కూతురును తిరిగి పాఠశాలకు పంపించేందుకు పుష్పలత తన భర్త శివకుమార్, కూతురుతో కలిసి ముగ్గురు బైక్‌పై పాఠశాలకు బయలుదేరారు. ఈ క్రమంలో నాగులపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు పుష్పలత బైక్‌పై నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో వెంటనే అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిగుబడి.. దిగాలు



పత్తి పంట

రైతులకు ఈసారి కలిసిరాని పత్తి సాగు!

- పత్తిని ముంచిన అధిక వర్షాలు
- ఈసారి వేధిస్తోన్న కూలీల కొరత
- పెట్టుబడులు రావడంలేదని రైతుల ఆవేదన

రాయికోడ్(అందోల్)/న్యాల్‌కల్ (జహీరాబాద్): ఈ ఏడాది పత్తి సాగు రైతులకు కలిసిరాలేదు. అధిక వర్షాలకు దెబ్బతిని దిగుబడి పడిపోయింది. రూ.వేలల్లో పెట్టుబడులు వెచ్చించిన రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంలేదని వాపోతున్నారు. ఎకరాకు కనీసం 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడిని ఆశించిన రైతులకు కేవలం మూడు నుంచి నాలుగు క్వింటాళ్లే వస్తుండటంతో రైతులు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు.

జిల్లాలో 3.68 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా సుమారు 3,87,539 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. సదాశివపేట, రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి, నారాయణఖేడ్, మనూరు తదితర మండలాల్లో అధికంగా సాగు చేశారు.

అప్పటికే పత్తి పంటపై ఎకరా సాగు కోసం రూ.30 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. తొలుత పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలో పత్తి రైతుల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భారీ వర్షాలకు పత్తిపంటలు దారుణంగా దెబ్బతినడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. వచ్చిన దిగుబడినైనా దక్కించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కూలీలకు అధిక రేట్లు ఓ వైపు, కూలీల కొరత మరోవైపు పత్తిరైతులను తీవ్రంగా వేధిస్తున్నాయి. పత్తితీత కోసం కిలో రూ.16 చొప్పున కూలీలకు చెల్లించాల్సి వస్తుండటంతో రైతులు నష్టాల బాట పడుతున్నారు.

వేధిస్తోన్న కూలీల కొరత

జిల్లాలో కూలీల కొరత ఉండటంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, మైబూబ్ నగర్, రంగారెడ్డి, దేవరకొండ, కర్నూల్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ఆటోలు, ఇతర వాహనాలను ద్వారా కూలీలను తెప్పించుకుని రైతులు పత్తితీత పనులు కొనసాగిస్తున్నారు. కూలీలను ఇతర ప్రాంతాల నుంచి రప్పించేందుకు అయ్యే రవాణ ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వస్తోంది. ఇక వలస కూలీలకు వారానికొకసారి దావత్ కూడా ఇవ్వవలసి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

రూ.12 వేలు చెల్లిస్తే...



ఆశించిన స్థాయిలో కాయలు లేని పత్తి చెట్టు

క్వింటాలు పత్తికి రూ.8,110లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడులు తగ్గనుండటంతో తాము నష్టపోవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లిస్తే నష్టాల నుంచి కొంతమేర బయట పడొచ్చని రైతులు ఆశిస్తున్నారు.

కూలీలు దొరకడం లేదు



నాలుగు ఎకరాల్లో పత్తిని సాగు చేసి రూ.లక్షకు పైగా వెచ్చించాను. పత్తితీతకు స్థానికంగా కూలీలు దొరకడం లేదు. యాసంగి పంటలపైనే ఆశలు పెట్టుకున్నాను.

-భాగన్న, రైతు మాటూర్ గ్రామం

రూ.12 వేల ధర నిర్ణయించాలి



అధిక వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. ప్రభుత్వం క్వింటాలు పత్తికి కనీసం రూ.12 వేలు నిర్ణయించి ఆదుకోవాలి. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడే వస్తోంది. దీంతో వెచ్చించిన పెట్టుబడులు వస్తే చాలని భావిస్తున్నాం.

-గోపాల్‌రెడ్డి, రైతు, ఖాంజమాల్‌పూర్ రాయికోడ్ మండలం

తీతలో జాగ్రత్తలు పాటించాలి

పత్తి పూత, కాత సమయాల్లో వర్షాలు అధికంగా కురవడంతో పత్తి దిగుబడి పడిపోయింది. దీంతో తీతలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. పత్తికాయ నుంచి పత్తిని పూర్తిగా తీయాలి. రవాణాలో పత్తి వృథాను అరికట్టాలి. పంటకు దుమ్ముధూళి అంటుకోకుండా చూసుకోవాలి. సూర్యోదయం అనంతరమే పత్తిని తీయాలి. పంటను ఆరబెట్టి నాణ్యతను కాపాడుకోవాలి.

-సత్యనారాయణ. ఏడీఏ రాయికోడ్.

కారు చీకట్లో కాంతి రేఖ..!

- కార్నియా సమస్యతో బాధపడే వారికి కేంద్రం శుభవార్త
- చనిపోయిన వ్యక్తి నుంచి నాలుగు నుంచి ఆరు గంటల్లోపు కార్నియా సేకరణ
- హైదరాబాద్ సరోజినిదేవి ఆసుపత్రికి తరలించి చికిత్స
- పైలెట్ ప్రాజెక్టు కింద సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి ఎంపిక

సిద్దిపేటకమాన్: కార్నియా కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఇదో శుభవార్త. తిరిగి చూపును ప్రసాదించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. పైలెట్ ప్రాజెక్టు కింద పోస్టు గ్రాడ్యుయేషన్ టీచింగ్ సదుపాయం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా సిద్దిపేట, నిజామాబాద్, ఆదిలాబాద్ మూడు ప్రభుత్వ ఆసుపత్రులను ఎంపిక చేసింది. ప్రభుత్వాసుపత్రిలో చనిపోయిన వ్యక్తి నుంచి ఆసుపత్రి ఆప్తమాలజీ విభాగ వైద్యులు కార్నియా సేకరించి హైదరాబాద్ సరోజిని దేవి కంటి ఆసుపత్రికి పంపుతారు. వాటిని అవసరమైన వారికి అమర్చి తిరిగి కంటి చూపును ప్రసాదించనున్నారు. ఇందుకోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులు, వైద్యులు, సిబ్బందికి శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ఆరు గంటల్లోపు కార్నియా సేకరణ

సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చే మృతదేహాల నుంచి ఆరు గంటల్లోపు కార్నియా సేకరించి, ప్రత్యేక బాక్సుల్లో స్టోర్ చేస్తారు. ఆర్టీసీ ద్వారా హైదరాబాద్ సరోజినిదేవి కంటి ఆసుపత్రికి తరలించనున్నారు. ఒక వ్యక్తి నుంచి సేకరించిన రెండు కార్నియాలు కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు చూపును తిరిగి తీసుకురావచ్చని ఆసుపత్రి ఆప్తమాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

స్టాఫ్ నర్సులకు అవగాహన

సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడంతో సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత ఆధ్వర్యంలో ఆప్తమాలజీ హెచ్‌ఓడీ చంద్రశేఖర్ వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలోని స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చారు. దీంతో ఆసుపత్రిలో మృతుడి కుటుంబ సభ్యులు, వారి అటెండ్లకు కార్నియా డొనేట్ చేసేలా కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించనున్నారు.

వైద్యులు, సిబ్బందికి అవగాహన



చనిపోయిన వ్యక్తి నుంచి ఆరు గంటల్లోపు కార్నియా సేకరించి సమస్యతో బాధపడుతున్న వారికి అమర్చడం వల్ల కంటి చూపును ప్రసాదించవచ్చు. పైలెట్ ప్రాజెక్టు కింద సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎంపికైంది. చనిపోయిన వ్యక్తి నుంచి కార్నియా దానం చేసేలా వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడానికి ఆసుపత్రి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం.

- డాక్టర్ సంగీత, సూపరింటెండెంట్ సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి



స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత, ఆప్తమాలజీ హెచ్‌ఓడీ చంద్రశేఖర్

ఉపాధ్యాయుడిపై దుండగుల దాడి

నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారీ

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై గుర్తు తెలియని ఆటో డ్రైవర్ మరో ముగ్గురు వ్యక్తులు కలిసి దాడి చేశారు. నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. ఈ సంఘటన నర్సాపూర్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలంలోని మంతూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తుంగని కిష్టయ్య కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో తన సొంత పనులు ముగించుకుని కొల్చారం బస్టాండ్ వద్ద రోడ్డుపై ఉన్నాడు. నర్సాపూర్ వైపు వస్తున్న ఆటోలో ఎక్కాడు. అయితే డ్రైవర్ ఒక్కసారిగా తూప్రాన్ వైపు ఆటోను స్పీడ్‌గా తీసుకెళ్లాడు. ఆటో డ్రైవర్ మరో ముగ్గురు వ్యక్తులు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తూప్రాన్ రోడ్డులోని కుంటలోకి ఉపాధ్యాయుడిని తీసుకెళ్లి చాకులతో బెదిరించి దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ 12 వందలు, సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ

శభాష్.. దుర్గయ్య

- బస్సులో మరిచిపోయిన 39 తులాల బంగారం బ్యాగ్ అప్పగింత
- నిజాయితీ చాటుకున్న ప్రయాణికుడికి డిపో సిబ్బంది సన్మానం

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు దుర్గయ్య నిజాయితీ చాటుకున్నాడు. సంగారెడ్డికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి వసుధ ప్రకాష్ భార్యాభర్తలు గురువారం సికింద్రాబాద్‌లో 39 తులాల బంగారం కొనుగోలు చేశారు. అనంతరం జూబ్లీహిల్స్ బస్టాండ్ నుంచి సంగారెడ్డికి బస్సులో తిరిగి వస్తుండగా బ్యాగ్ సీట్‌లో పడిపోయింది. అయితే అదే బస్సులో ప్రయాణిస్తున్న దుర్గయ్య అనే ప్రయాణికుడు కండక్టర్ శ్రీధర్ రెడ్డికి బ్యాగ్‌ను అందజేశాడు. వెంటనే డిపో మేనేజర్‌కు తెలియజేయగా.. సంబంధిత ప్రయాణికులకు సమాచారం అందించి సుమారు రూ.50 లక్షల విలువ చేసే 39 తులాల బంగారు బిస్కెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నిజాయితీ చాటుకున్న దుర్గయ్యను ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం కుటుంబ సభ్యులు అతడికి ధన్యవాదాలు తెలిపారు.



బంగారాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

యువతి ఆత్మహత్య



ఆసియా పర్వీన్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): నిశ్చితార్థమై పెళ్లి చేసుకోవాల్సిన యువకుడు ఆత్మహత్య చేసుకోవడంతో మనస్తాపానికి గురైన యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన గురువారం కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు కేసీఆర్ నగర్‌లో నివాసముండే ఆసియా పర్వీన్ (19)కు ఆరు నెలల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాకు చెందిన మహబూబ్‌తో నిశ్చితార్థం జరిగింది. అప్పటి నుంచి ఇరువురు ఫోన్లలో తరచూ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో పక్షం రోజుల క్రితం మహబూబ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ ఘటనను జీర్ణించుకోలేక మనస్తాపంతో పర్వీన్ బుధవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తులో ఉంది.

రేగులపల్లెలో చోరీ

బెజ్జంకి(సిద్దిపేట): రేగులపల్లెలో చోరీ జరిగింది. దేవిశెట్టి శ్రీనివాస్‌రావు అనే ఆటో డ్రైవర్ ఇంట్లో బుధవారం రాత్రి దుండగులు రూ.40 వేల నగదు, రెండున్నర గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ సౌజన్య తెలిపారు. వీరితో పాటు మరో రెండు ఇళ్లల్లోనూ చోరీకి యత్నించారని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

వ్యక్తి ఆత్మహత్య



రామకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గాగ్గిళ్లాపూర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబుబ్ కథనం ప్రకారం.. గాగ్గిళ్లాపూర్‌కు చెందిన ఏలూరి రామకృష్ణ (33) పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రామకృష్ణకు తొమ్మిదేళ్ల క్రితం దూల్మిట్ట మండలం తోర్నాలకు చెందిన మమతతో వివాహం జరిగింది. వీరికి ఎనిమిదేళ్ల కూతురు ఉంది. నాలుగేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అనంతరం రామకృష్ణ మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య మమత రామకృష్ణకు పలుమార్లు ఫోన్‌చేసి నీతోనే ఉంటానని చెప్పడంతో రామకృష్ణ పెద్దమనుషుల సమక్షంలో రెండో భార్యకు విడాకులు ఇచ్చి, మొదటి భార్యతో తిరిగి కాపురం పెట్టాడు. రెండు నెలల క్రితం మమత తన భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడంలేదు. దీంతో మనస్తాపానికి గురైన రామకృష్ణ.. తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు.

భార్యతో గొడవపడి..

ఉరేసుకొని బలవన్మరణం



సంగయ్య

నారాయణఖేడ్: మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రావుల శ్రీశైలం కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చాకలి సంగయ్య(57), మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. తాగిన మైకంలో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి సైతం మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. తాగి ఎందుకు గొడవచేస్తావని ఆమె ప్రశ్నించడంతో ఆవేశంతో పట్టణంలోని ఆక్సిజన్ పార్కులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతిపై అతడి భార్య, ఇతర కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంతానం కలగడం లేదని..

సంగారెడ్డి టౌన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం సదాశివనగర్‌కు చెందిన మన్నే రాజశేఖర్(39), స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరగగా ఇప్పటి వరకు ఎలాంటి సంతానం లేదు. ఇంట్లో గొడవల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విరామమెరుగని బోధన

ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగ రాములు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గంగ రాములు

హత్నూర(సంగారెడ్డి): పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు 80 ఏళ్ల వృద్ధాప్యంలో సైతం విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల కేంద్రమైన హత్నూరకు చెందిన కోట గంగ రాములు 1968లో ఉపాధ్యాయుడిగా జిన్నారం మండలం శివనగర్ పాఠశాలలో ఉద్యోగ జీవితం ప్రారంభించి.. 2004 ఏప్రిల్‌లో మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం గంగారం పాఠశాలలో పదవీ విరమణ పొందారు. అనంతరం బోరపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది సంవత్సరాలుగా ఉచితంగా తెలుగు బోధన చేశారు. దౌల్తాబాద్ పాఠశాలలో రెండేళ్లు, కొన్యాల పాఠశాలలో ఐదు నెలలు తెలుగు బోధించారు.

2011 నుంచి హత్నూర కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో 14 ఏళ్లుగా ఉచితంగా విద్యార్థినులకు తెలుగు బోధిస్తున్నారు. వద్ధాప్యంలో 9 ఏళ్ల క్రితమే భార్య లక్ష్మీనరసమ్మ మృతి చెందింది. సంతానం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల పిల్లలనే తన పిల్లలనుకుంటున్నారు. ప్రతిరోజు సమయానికి పాఠశాలకు వచ్చి పిల్లలతోనే భోజనం చేసి సాయంత్రం వరకు వారికి బోధిస్తున్నారు. 1999లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం నుంచి అవార్డు సైతం అందుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి నెల పెన్షన్ విద్యార్థుల అవసరాలకు, ఆడపిల్లల చదువులు, పెళ్లిళ్లకు కొంతమేర సహాయం అందిస్తానని గంగ రాములు తెలిపారు. 80 ఏళ్ల ఉచితంగ బోధిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నారు.

మనసున్న మాస్టారు..



వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించిన దృశ్యం

- 39 మంది విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత
- ఉపాధ్యాయుడు రమేశ్ సేవలు అభినందనీయం: హెచ్‌ఎం

తొగుట(దుబ్బాక): విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసిన ఉపాధ్యాయుడు ముక్క రమేశ్ అభినందనీయుడని ప్రధానోపాధ్యాయుడు నయీమా కౌసర్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో చేరిన 39మందికి రమేశ్ దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పేద కుటుంబాల విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని గమనించి వారి అవసరాలను తీర్చడం గొప్ప విషయమన్నారు. ఐదేళ్లుగా విద్యార్థులకు ఏదో రకంగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఒరాకిల్ స్వచ్ఛంద సంస్థ నుంచి రూ 40వేల విరాళంగా సేకరించడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు రూ 5వేల విలువగల క్రీడా సామగ్రిని అందించారని తెలిపారు. విద్యార్థులు ఎంఎంఎస్ పరీక్షలకు సిద్ధం కావడానికి రూ 3వేల విలువగల పుస్తకాలు అందించారని గుర్తుచేశారు. రమేష్ అందిస్తున్న సేవా కార్యక్రమాల మూలంగా పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ప్రతిఏటా పెరుగుతోందన్నారు.

సైబర్ మోసం.. నిందితుడి అరెస్ట్

హత్నూర(సంగారెడ్డి): ఫేక్‌డీపీతో అమ్మాయిలా పరిచయమై ఓ ఇంజనీరింగ్ విద్యార్థి నుంచి రూ.10.33 లక్షల కాజేసిన సంఘటన హత్నూర మండలంలో చోటుచేసుకుంది. ఈ మేరకు నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతడికి సహకరించిన మరో నిందితుడిని గురువారం అరెస్టు చేసినట్లు జిన్నారం సీఐ నయీముద్దీన్, హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డిలు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఆన్‌లైన్‌లో అమ్మాయి ఫొటోతో ఇంజనీరింగ్ విద్యార్థికి పరిచయమై డబ్బులు వసూ లు చేశారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి ప్రధాన నిందితుడు సీలం సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేయగా అతడికి సహకరించిన అతడి స్నేహితుడు గడ్డం ప్రకాశ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. రెండవ నిందితుడు గడ్డం ప్రకాశ్ నుంచి రూ. 46 వేల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సైబర్ మోసానికి పాల్పడుతున్న మరి కొందరిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నిందితులది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపూర్‌గా పేర్కొన్నారు.